# వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం



మడకశిర మున్సిపల్ కౌన్సిల్ మీట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

- తాగునీరు, విద్యుత్ సమస్యలపై ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆగ్రహం
- అధికారులు నిర్లక్ష్యాన్ని వీడాలని మండిపాటు

**మడకశిర:** మడకశిర మున్సిపల్ కౌన్సిల్ మీట్ వాడీవేడిగా జరిగింది. మంగళవారం చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో కౌన్సిల్ మీట్ జరిగింది. ఎమ్మెల్యే తిప్పేస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నెలకున్న తాగునీటి సమస్యపై మున్సిపల్ ప్రజా ప్రతినిధులు, అధికారులపై ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని యాదవకాలనీకి చెందిన మహిళలు తన ఇంటి వద్దకు వచ్చి తాగునీటి సమస్యపై ఫిర్యాదు చేశారన్నారు. తాగునీటి సమస్య పరిష్కరిస్తానని మహిళలకు సర్ది చెప్పి పంపానని తెలిపారు. రోజూ ఏదో ఒక ప్రాంతానికి చెందిన ప్రజలు వచ్చి తాగునీటి సమస్యను తనకు చెప్పుకుంటున్నారని , ఇలా ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు. కౌన్సిలర్లు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. చైర్‌పర్సన్, కౌన్సిలర్లు ఇలా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, వెంటనే పరిష్కరించాలని కోరారు. నిర్లక్ష్యం చేస్తే ఊరుకోబోమనని హెచ్చరించారు. పట్టణంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు

**విద్యుత్‌శాఖ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం**

విద్యుత్‌శాఖ అధికారులపై ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో రోడ్డు మధ్య ఉన్న విద్యుత్ స్తంభాల వలన ప్రజలు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, వాటిని ఎందుకు తొలగించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోల్ కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై, ఇలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ముధుగిరి సర్కిల్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చమని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదన్నారు. చీపులేటిలో తాగునీటి పథకం బోరుకు మున్సిపల్ అధికారులు డబ్బులు చెల్లించినా విద్యుత్ సరఫరా చేయలేదని మండిపడ్డారు. వెంటనే పోల్ కాంట్రాక్టర్‌ను మార్చాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఈ సక్రమంగా పనిచేయకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్‌చైర్ పర్సన్ వెంకటలక్ష్మమ్మ, కమిషనర్ ప్రభాకర్ రావు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు,అధికారులు పాల్గొన్నారు.

# నవరత్నాలతో ప్రతి ఇంటా వెలుగులు

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

**హిందూపురం:** నవరాత్నాలతో ప్రతి ఇంటా వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. మున్సిపాల్టీ పరిధిలోని 2వవార్డు చౌడేశ్వరీకాలనీ–2లో కౌన్సిలర్ రామచంద్ర ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తూనే స్థానిక సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ అవినీతి, వివక్ష లేకుండా ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తుండటంతో సీఎం జగన్ దేశానికి ఆదర్శంగా నిలిచారన్నారు. గత టీడీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యులకు లంచాలు ఇస్తేనే పథకాలు అందేవని విమర్శించారు. నేడు అర్హతే ప్రామాణికంగా ఎలాంటి వివక్ష లేకుండా ఇంటివద్దకే నేరుగా సంక్షేమ పథకాలు వచ్చి చేరుతున్నాయని చెప్పారు. నాలుగున్నర ఏళ్లలో ఎన్ని అవాంతరాలు వచ్చినా సంక్షేమాన్ని ఏ రోజూ ఆపలేదని స్పష్టం చేశారు.

**ప్రజల కష్టాలు ఏనాడైనా పట్టించుకున్నావా బాలయ్య?**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ చేరుతుండటంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్.దీపిక అన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్న జగనన్నకు మరోసారి అండగా నిలవాలని కోరారు. రానున్న రోజుల్లో హిందూపురం నియోజవర్గాన్ని జిల్లాలోనే మేటిగా నిలుపుతామన్నారు. పదేళ్లగా ఎమ్మెల్యేగా ఉన్న బాలకృష్ణ చౌడేశ్వరీకాలనీలో ఇల్లు తీసుకుని చుట్టుపు చూపుగా వచ్చిపోతున్నారే తప్ప ఒక్కసారైనా కాలనీలో ప్రజల మధ్యకు వచ్చి సమస్యలు తెలుసుకున్న పాపానపోలేదని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, ఏసీపీ సునిల్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, కౌన్సిలర్లు శివ, ఆసీఫ్‌వుల్లా, షాజియా, వైఎస్సార్‌సీపీ ఏ, బీ బ్లాక్ కన్వీనర్లు సీపీసీ సాధిక్, నరేష్, నాయకులు నాగమణి, ఫరూక్, వేణుగోపాల్, గంగాధర్, బేరింగ్ మస్తాన్,రాము, మహాజాన్, కిష్టప్ప గృహసారథులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



2వ వార్డులో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్.దీపిక



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

# ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే శంకరనారాయణ

**గోరంట్ల:** ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం చేపట్టిందని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ తెలిపారు. పేదలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండలంలోని పాలసముద్రం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం సర్పంచ్ చిన్నగంగప్ప ఆధ్వర్యంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే శంకరనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేదలకు కార్పొరేట్ వైద్యసేవలు అందించే లక్ష్యంతో ఆరోగ్యశ్రీ పథకంతో పాటు 104 సేవలను తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి ఆరోగ్య శ్రీపథకానికి మరిన్ని మెరుగులు దిద్దడంతో పాటు ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ తీసుకొచ్చారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ప్రతి కుటుంబాన్ని వైద్యులు సందర్శించి, అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు ఇంటివద్ద చికిత్సలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనికి తోడు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వలంటీర్లు, వైద్యాసిబ్బంది సంయుక్తంగా ప్రతి కుటుంబాన్ని సందర్శించి సర్వేనిర్వహించి జబ్బులతో బాధపడుతున్న వారికి గుర్తించి ప్రత్యేక క్యాంపుల ద్వారా నిపుణులైన డాక్టర్లచే పరీక్షించి మందులు, అవసరమైన వారికి ఆపరేషన్లు చేస్తున్నట్లు చెప్పారు.

**ఘనంగా వల్లభాయ్ పటేల్ జయంతి**

ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో పాలసముద్రం ఉన్నత పాఠశాలలో సర్ధార్ వల్లభాయ్‌పటేల్ జయంతిని నిర్వహించారు. వల్లభాయ్ చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జాతీయ సమైక్యత కోసం భారత దేశ ఉక్కు మనిషి పటేల్ కృషిచేశారని ఎమ్మెల్యే కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫకృద్దీన్‌సాహెబ్, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరిశంకరరెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు బాషా, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, పెనుకొండ జెడ్పీటీసీ సభ్యులు గుట్టూరు శ్రీరాములు, పెనుకొండ మార్కెట్ యార్డు చైర్మన్ నాగలురుబాబు, మండల ఉపాధ్యక్షులు నాగభూషణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### కొవ్వొత్తుల ప్రదర్శన



కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

**రొద్దం:** పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని ఎస్‌ఐ వలిబాషా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన వీధి బస్‌స్టాండ్ ఆవరణలో పోలీసులు, విద్యార్థులు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు.

### డివైడర్‌ను ఢీకొన్న కారు

**పెనుకొండ రూరల్:** పెనుకొండ 44వ జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి హరిపురం వద్ద పెనుకొండ వైపు నుంచి అనంతపురం వైపు వెళ్తున్న ఓ కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొంది. ఈ ఘటనలో డ్రైవర్ నరేష్ గాయపడగా 108 వాహనం ద్వారా అతన్ని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

### విజేతలకు బహుమతులు



బహుమతులు అందజేస్తున్న ఆర్టీసీ డిపో మేనేజర్ హంపన్న

**లేపాక్షి:** హిందూపురం – కొడికొండ చెక్ పోస్టుకు వెళ్లే పల్లె వెలుగు బస్సుల్లో ఏర్పాటు చేసిన లక్కీ గిఫ్ట్ స్కీం కింద ఎంపికైన విజేతలకు ఆర్టీసీ డిపో మేనేజర్ హంపన్న, కంట్రోలర్ ఆర్ఎస్‌కే బాషా బహుమతులు అందజేశారు. లేపాక్షి ఆర్టీసీ బస్టాండులో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. హిందూపురం వైష్ణవి ఇఎన్‌టీ డాక్టర్ అనీల్ సౌజన్యంతో మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులిచ్చారు.

### ఉద్యాన కోర్సుపై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ

**మడకశిరరూరల్:** మండల పరిధిలోని ప్రభుత్వ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం నీలకంఠాపురం ఉన్నత పాఠశాలలో ఉద్యాన కోర్సు, పంటల సాగుపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ రమణ మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణతో విద్యను అభ్యసించి మంచి ఫలితాలు సాధించి ఉద్యాన కోర్సులో చేరి భవిష్యత్‌కు బంగారు బాట వేసుకోవాలన్నారు. హెచ్ఎం చంద్రమౌళి, పీడీ రాజేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

**హిందూపురం టౌన్:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు స్థానిక కొట్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభ, పీడీ రామకృష్ణ తెలిపారు. అండర్–14 విభాగంలో నిశాంత్, అండర్–17లో మనోజ్‌కుమారరెడ్డి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు చెప్పారు.

# భూమి కబ్జా అవుతున్నా పట్టించుకోరా?

- నిరసన ప్రదర్శనలతో ముగిసిన 'పురం' కౌన్సిల్ మీట్



హిందూపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**హిందూపురం:** మున్సిపల్ ఓపెన్ ల్యాండ్స్‌ను కబ్జా చేసి లేఅవుట్లుగా మార్చి అమ్ముకుంటున్నా ఎందుకు మిన్నకుంటున్నారని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ఈర్షద్ అహ్మద్ అధికారులను ప్రశ్నించారు. మంగళవారం హిందూపురం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో కౌన్సిల్ సర్వసభ్య సమావేశం జరిగింది. 5వ వార్డు కౌన్సిలర్ ఈర్షాద్ అహ్మద్ ప్రభుత్వ భూముల కబ్జాపై ప్రశ్నించారు. దీంతో దీనిపై విచారించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. వార్డుల్లో అనుమతులు లేని కొళాయిలు తొలగించడం సరైందేనని, అయితే వార్డు కౌన్సిలర్‌కు చెప్పకుండా ప్రజలకు అవసరమైన వాటిని కూడా తొలగిస్తే నీటి సమస్య ఎలా పరిష్కరం అవుతుందని 10వవార్డు కౌన్సిలర్లు పార్వతి ప్రశ్నించారు. నానెప్పనగర్‌లోని కాయగూరల మార్కెట్ గదులు ఏళ్లు దాటినా ప్రారంభానికి నోచుకోకుండా శిథిలం అవుతున్నా ఎవరూ పట్టించుకోరా అని కౌన్సిలర్ ఆసీఫ్‌వుల్లా ఆవేదన వ్యక్తం చేశారు. తన వార్డులో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని 17 వార్డు కౌన్సిలర్ మాజన్ ప్లకార్డుతో కౌన్సిల్ హాల్లోనే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్లు సర్దిచెప్పి అభివృద్ధి పనులు కేటాయించి పనులు చేయిస్తామని హామీ ఇచ్చారు. పరిగి బస్టాండ్ వద్ద మున్సిపల్ బిల్డింగ్ రూములకోసం తాము చెల్లించిన రూ.4.50 వెనక్కు ఇప్పించాలంటూ 7వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ నజీరాభాను తన భర్త షఫీతో పాటు కౌన్సిల్ హాల్ డోర్ అడ్డంగా కుర్చొని నిరసన తెలిపారు. దీంతో వైస్‌చైర్మన్లు బలరామిరెడ్డి, జబీవుల్లాతో పాటు కౌన్సిలర్లు జోక్యం చేసుకొని వారికి నచ్చజెప్పారు. అందరితో చర్చించి న్యాయం చేస్తామని చెప్పడంతో వారు నిరసన విరమించారు. మొత్తానికి గందరగోళం మధ్యనే కౌన్సిల్ సమావేశం ముగిసింది.

# కుస్తీ పోటీల్లో జాతీయస్థాయిలో ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

**హిందూపురం టౌన్:** పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కుస్తీ పోటీల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. హర్యాన రాష్ట్రంలోని లోథాలో జరిగిన జాతీయ స్థాయి కుస్తీ పోటీల్లో ముద్దిరెడ్డిపల్లి జెడ్పీహెచ్ఎస్ 10వ తరగతి విద్యార్థి ఎస్.సయ్యద్ 45 కేజీల విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించాడు. అలాగే 7వ తరగతి విద్యార్థి శోభన్, 8వ తరగతి విద్యార్థి శ్రీచరణ్ 49 కేజీల విభాగంలో బ్రౌంజ్ మెడల్స్ సాధించారు. మంగళవారం వారిని హెచ్ఎం రాజశేఖరాచారి, పీడీ సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

# పౌర హక్కులపై అవగాహన



సోమందేపల్లి: గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

**సోమందేపల్లి:** మండలలోని నాగినాయని చెరువు తండాలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేష్ పౌరహక్కులపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో సర్పంచు అంజినాయక్, ఎస్ఐ విజయ్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

**మడకశిరరూరల్:** మండలంలోని మణూరు పంచాయతీలోని గ్రామాల ప్రజలు సోదర భావంతో కలిసి మెలసి ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని గ్రామ కార్యదర్శి ఆనంద్‌కుమార్, ఈఓఆర్డీ శైలజ తెలిపారు. మంగళవారం వైజీపీ తండాలో పౌర హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

### సేవతోనే మంచి పేరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

**మడకశిర:** సామాజిక సేవా కార్యక్రమాలతోనే మంచి పేరు వస్తుందని ఎమ్మెల్యే తిప్పేస్వామి అన్నారు. మంగళవారం పట్టణంలో ఫోర్‌వీల్ డ్రైవర్స్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 32 మంది డ్రైవర్లు రక్తదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రైవర్లు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి ఆర్ఎంఓ దివాకర్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, జేసీఎస్ కన్వీనర్ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

### మట్కా బీటర్ అరెస్ట్

**మడకశిర:** పట్టణంలోని పెనుకొండ రోడ్డులో మంగళవారం ఓ మట్కా బీటర్‌ను అదుపులోకి తీసుకొని రూ.15 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ లోకేశ్ తెలిపారు. మట్కా చీటీలతో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

### సిల్క్ రీలర్లకు అండగా ఉంటాం



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

**హిందూపురం:** హిందూపురం సిల్క్ రీలర్స్‌కు ప్రభుత్వ పరంగా రావాల్సిన సదుపాయలు, సౌకర్యాల కల్పనకు తమవంతు కృషిచేస్తామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. మంగళవారం కొటిపి గ్రామ పంచాయతీ సమీపంలోని ఇస్లాంపూర్ కాలనీ వద్ద ఏర్పాటైన సిల్క్ రీలర్స్ అసోసియేషన్ లేఅవుట్‌ను దీపిక ప్రారంభించారు. ఇక్కడ రీలర్స్ నిర్మించుకుంటున్న ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సహకారం అందిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, మున్సిపల్ వైస్‌చైర్మన్ జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.



గుడిబండ: జెడ్పీహెచ్ఎస్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



అమరాపురం: వల్లభాయ్ పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ ఈరన్న, తదితరులు



అగళి: ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది

# ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం

**సాక్షిబృందం:** హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలుచోట్ల రన్ ఫర్ యూనిటీ ర్యాలీలు, ప్రతిజ్ఞలను నిర్వహించారు.



మడకశిర: యూనిటీ రన్ నిర్వహిస్తున్న విద్యార్థులు



రొళ్ల మండలం టీడీ పల్లిలో రన్ ఫర్ యూనిటీ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు



చిలమత్తూరు: గ్రంథాలయంలో వల్లభాయ్ పటేల్, ఇందిరాగాంధీ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



హిందూపురం: బీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



లేపాక్షి: మానవహారంగా ఏర్పడిన కొండూరు జెడ్పీ స్కూల్ విద్యార్థులు



రొద్దం: జూనియర్ కాలేజీలో అధ్యాపకుల ఉపన్యాసం వింటున్న విద్యార్థులు

### మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి నివాళి

**హిందూపురం టౌన్:** ప్రధాన మంత్రిగా ఇందిరా గాంధీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంగళవారం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక ఇందిరాగాంధీ సర్కిల్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు బాలాజీ మనోహర్, అమానుల్లా, జమీల్, తిరుపాల్, ఫయాజ్, టౌన్ అధ్యక్షుడు శ్యాం కిరణ్, పీసీసీ కార్యదర్శి హరిత తదితరులు పాల్గొన్నారు.

### నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే చర్యలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వి.శ్రీనివాసులు

**హిందూపురం అర్బన్:** నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ వి. శ్రీనివాసులు వాహనదారులను హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని గురునాథ్ సర్కిల్‌లో స్కూల్, కాలేజ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాహన ఆర్‌సి,డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపితే కేసులు తప్పవన్నారు.

### అనారోగ్యంతో విద్యార్థి మృతి



మురళి (ఫైల్)

**చిలమత్తూరు:** మండలంలోని కొత్తచామలపల్లికి చెందిన మురళి (13) అనే విద్యార్థి మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. రెండు నెలలుగా బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. కుమారుడి మృతితో మురళి తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

## సంక్షిప్త సమాచారం

**నేడు చేపల చెరువు వేలం**

**అమరాపురం:** మండలంలోని కె.శివరం గ్రామ చెరువులో చేప పిల్లలు వదలడానికి చేపల చెరువు వేలం పాటను నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ సర్పంచ్ మంజుల, కార్యదర్శి మనోహర్ శర్మ తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయంలో బుధవారం ఉదయం 10:30 గంటలకు వేలం పాట జరుగుతుందన్నారు.

**రైతు భరోసా కేంద్రం తనిఖీ**

**సోమందేపల్లి:** మండలంలోని గుడిపల్లిలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని ఏఓ కవితా రాణి మంగళవారం తనిఖీ చేశారు. సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. పంటల సాగు, ఈ క్రాప్‌లపై అవగాహన కల్పించారు.

**8న విద్యా సంస్థల బంద్**

**మడకశిర:** విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణ, కడపలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం 8న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరేష్, ఏఐఎస్ఏ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పిలుపు నిచ్చారు. బంద్‌కు అన్ని విద్యా సంస్థలు సహకరించాలని కోరారు.

**ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం**



లేపాక్షి: జెండా ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

**పరిగి:** మండల పరిధిలోని ప్రికాట్ మిల్ వద్ద ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాయకులు జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గంగాధరప్ప, శ్రీనివాసులు, నారాయణరెడ్డి, జగదీష్, ఆదినారాయణ పాల్గొన్నారు.

**లేపాక్షి:** మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్స వేడుకను ఘనంగా జరుపుకున్నారు. మండలాధ్యక్షుడు గోవిందప్ప జెండాను ఆవిష్కరించారు. మండల కార్యదర్శి శివప్ప , గౌతమ్‌కుమార్, గంగన్న, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

**బూత్ లెవెల్ అధికారులతో సమీక్ష**

**రొళ్ల:** రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 4, 5వ తేదీల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ హసీనా సుల్తానా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బూత్ లెవెల్ అధికారులతో ఓటరు నమోదుపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

**మడకశిరలో బీజేపీ జిల్లా అధ్యక్షుడి పర్యటన**

**మడకశిర:** బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల శేఖర్ మంగళవారం మడకశిరలో పర్యటించారు. ఆయన ఆర్అండ్‌బీ బంగ్లాలో బీజేపీ పదాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నవంబర్ 6న హిందూపురం వస్తారన్నారు. పర్యటనను బీజేపీ కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.